పశ్చిమాన


:నేడు పుచ్చకాయలమడకు ముఖ్యమంత్రి రాక

జలం పరవళ్లు తొక్కాలి



పశ్చిమ ప్రాంతం.. ఎర్ర, నల్లరేగడితో కూడిన పొలాలు.. జలం ఉంటే అక్కడి జనం సిరులు పండిస్తారు. చుక్క నీరు లేక ప్రజలు సుగ్గి (వలస) బాట పడుతున్నారు.. కర్షకులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో పలు ప్రాజెక్టులకు పునాది వేశారు.. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లూ పట్టించుకోలేదు.. పైసా విడుదల చేయలేదు.. ఎక్కడ చూసినా అర్ధంతరంగా ఆగిపోయినవే దర్శనమిస్తున్నాయి.. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు తొలిసారి పశ్చిమ ప్రాంతానికి వస్తున్నారు.. తుంగభద్ర, వేదవతి నదుల నీటికి అడ్డుకట్ట వేసి పొలాలకు మళ్లించాలని కర్షకులు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ, ఎమ్మిగనూరు



ఈ సీజన్‌లో శ్రీశైలానికి చేరిన వరద టీఎంసీలలో

కృష్ణా నది	798
తుంగభద్ర	219
హంద్రీ	1

ఎల్లెల్సీ ఏడిపిస్తోంది

పశ్చిమ ప్రాంతం మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో ఎల్లెల్సీ కాల్వ విస్తరించి ఉంది. దీని కింద 1.50 లక్షల ఎకరాల్లో వరి, వేరుసెనగ, మిరప, పత్తి తదితర పంటలు సాగు చేస్తుంటారు. ఎగువ కర్ణాటక నుంచి 24 టీఎంసీలు రావాల్సి ఉంది. ప్రధాన కాల్వ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు 200 కి.మీ. ఆనవాళ్లు కోల్పోయింది. దీంతో 15 టీఎంసీల నీరు కూడా రావడం లేదు. గత నాలుగేళ్లలో వైకాపా చిల్లిగవ్వ ఇవ్వలేదు. కాల్వలు మరమ్మతులు చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.

ఒట్టిపోయిన గురురాఘవేంద్ర

తుంగభద్ర దిగువ కాల్వ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టును రూ.180 కోట్లతో నిర్మించారు. తుంగభద్ర నది ప్రాంతంలో పంప్‌హౌస్‌లు నిర్మించి అక్కడి నుంచి నీటిని ఎత్తిపోస్తారు. ఇందులో భాగంగా 11 రిజర్వాయర్లలో 5.373 టీఎంసీ నీటిని నిల్వ చేసుకుంటూ 40 వేల ఎకరాల ఆరుతడి, 10 వేల ఎకరాల తరి భూములకు సాగు నీరు అందించాల్సి ఉంది. నిర్వహణ, విద్యుత్తు బిల్లులు ఇతర వాటికి రూ.కోట్లు నిధులు అవసరమని గత ఎమ్మెల్యేలు సాగునీటి మండలి సమావేశంలో అడిగినా పైసా కేటాయించలేదు. దీంతో నిర్వహణ లేక ఎత్తిపోతల పథకాలు ఒట్టిపోయాయి.



ఆగిన ఆర్డీఎస్

పశ్చిమ ప్రాంత రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని అప్పటి తెదేపా హయాంలో రూ.1,986 కోట్లతో ఆర్డీఎస్ నిర్మించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ కాల్వ సమీపంలో బాత్రబొమ్మలాపురం వద్ద రెగ్యులేటరు నిర్మాణం చేపట్టారు. అంతలోనే ఎన్నికలు రావడం.. వైకాపా అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఈ ప్రాజెక్టులపై దృష్టి సారించలేదు. రూ.11 కోట్లతో పనులు చేపట్టిన ఏజెన్సీకి గత ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడంతో పనులు ఆగిపోయాయి.

'గుండ్రేవుల' గుండెకాయ

నిల్వ చేసుకొనే అవకాశం లేక ఏటా వందల టీఎంసీల వరద తుంగభద్ర నదీ నుంచి దిగువకు వెళ్తున్నాయి. 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే కేసీ ఆయకట్టు కింద రెండు పంటలకు పూర్తిగా సాగు నీరు అందించొచ్చు. 2.65 లక్షల ఎకరాలకు సాగు, 659 గ్రామాలకు మంచినీరు అందించడానికి మార్గం సుగమం అవుతుంది. తెదేపా అధికారంలో ఉండగా ప్రతిపాదనలు రూపొందించారు.. శంకుస్థాపన చేశారు.. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా పట్టించుకోలేదు.. గత ఐదేళ్ల కాలంలో తుంగభద్ర నుంచి 1,498 టీఎంసీల నీరు దిగువకు వెళ్లిపోయింది.

వేదవతి వేదన

ఎనిమిది టీఎంసీల నిల్వతో 80 వేల ఎకరాలకు సాగు నీరు, 253 గ్రామాలు, రెండు మున్సిపాలిటీలకు తాగునీరు అందించేందుకు 2019లో చంద్రబాబునాయుడు వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు టీఎంసీలకు కుదించి.. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.1942 కోట్లకు పెంచారు. భూసేకరణ పనులు చేపట్టకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

అందని 'హంద్రీ'

కాల్వలు లేక హంద్రీ ఆయకట్టుకు నీరందడం లేదు. 80 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. 2005లో రూ.197 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.162 కోట్ల పనులను గుత్తేదారుడు పూర్తి చేశారు. ఆ తర్వాత ఆపేశారు. అప్పటి వైకాపా ప్రభుత్వం 2020లో జీవో ఇవ్వడంతో కాల్వలు డిస్ట్రిబ్యూటర్ల పనులు ఆగిపోయాయి. ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. హంద్రీనీవా ప్రధాన కాల్వను 200 కి.మీ. మేర వెడల్పుతో పాటు లైనింగ్ చేసేందుకు రూ.4,650 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు 2021 డిసెంబరులో రెండు ఏజెన్సీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

చెరువుకు చేరని నీరు

పశ్చిమ ప్రాంతానికి చెరువులే ఆధారం.. ఏటేటా వర్షపాతం తగ్గడంతో నీటి జాడ కానరాలేదు. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలతో నింపాలని తెదేపా హయాంలో నిర్ణయించారు.. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనులు ప్రారంభించారు. అప్పటికే 40 శాతం పూర్తి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు.. అక్కడక్కడ పనులు చేసి ఎన్నికల ముందు జగన్ 'జల' బటన్ నొక్కారు. 1.238 టీఎంసీల కృష్ణాజలాలను 90 రోజుల వ్యవధిలో పంపింగ్ చేయాలి. ప్రస్తుతం హంద్రీకాల్వ నిండుగా ప్రవహిస్తోంది. ఒక్క చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.

నగరడోణ మోగాలి

రూ.53 కోట్లతో నగరడోణ ప్రాజెక్టు నిర్మాణానికి 2021లో శ్రీకారం చుట్టారు. 4,200 ఎకరాలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో దీనికి రూపకల్పన చేశారు. ఆలూరు బ్రాంచ్ (ఏబీసీ) కాల్వకు అనుసంధానం చేస్తూ దీనిని నిర్మించనున్నారు. పూర్తయితే చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాల్లోని రైతులకు సాగునీరు అందుతుంది. 50 శాతం పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వం ఒక్క రూపాయి బిల్లు కూడా చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు.

రాయితీ శనగ విత్తన ధరలు ఖరారు



కర్నూలు వ్యవసాయం, పాణ్యం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో రాయితీపై పంపిణీ చేసే శనగ విత్తనాల ధరలను ఖరారు చేస్తూ వ్యవసాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శనగలు (జేజీ-11 రకం) క్వింటా పూర్తి ఖరీదు రూ.9,400 కాగా.. 25 శాతం రాయితీతో క్వింటా రూ.7,050గా ధర నిర్ణయించింది. కాగా బహిరంగ మార్కెట్‌లో శనగలు క్వింటా రూ.6,700 నుంచి రూ.7200 వరకు ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధిక ధరలకు సరఫరాదారుల నుంచి శనగలు కొనుగోలు చేసి.. రాయితీపై ఇవ్వడం ద్వారా రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కర్నూలు జిల్లాకు 45,955 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 26,161 క్వింటాళ్ల రాయితీ శనగ విత్తనాలను కేటాయించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



హెలీప్యాడ్ వద్ద తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

ఇంటింటికెళ్లి పింఛన్లు ఇవ్వనున్న సీఎం ● గ్రామస్థులతో ముఖాముఖి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం పత్తికొండ మండలం పుచ్చకాయలమడకు రానున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు హెలికాప్టర్‌లో వస్తారు. 1.05 గంటల నుంచి 1.10 వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 1.45 గంటల నుంచి 2.25 వరకు కాశీశ్వరాలయంలో పూజలు అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తారు. 2.25 గంటల నుంచి 3.25 గ్రామస్థులతో ముఖాముఖికానున్నారు. రూ.1.38 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన కేవలం ఒక్క గ్రామానికి సంబంధించినదే కావడంతో ఇతర ప్రాంతాల వారికి అనుమతి లేదని పోలీసులు తెలిపారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

ఉల్లి రైతుల వెలవెల



- సిండికేటైన వ్యాపారులు
- అమాంతం ధర తగ్గించారు

పెద్ద మార్కెట్లో వ్యాపారులు జతకట్టారు.. ఉల్లి ధరలు భారీగా తగ్గించారు.. రైతులకు కన్నీళ్లు మిగిల్చారు. బహిరంగ మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.35 నుంచి రూ.50 పలుకుతోంది. వ్యవసాయ విపణిలో ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.3,660కు పడిపోయింది. సెప్టెంబరు 23 నుంచి 28వ తేదీ వరకు ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4 వేల నుంచి రూ.4,389 పలికింది. ప్రస్తుతం క్వింటాపై రూ.400కు పైగా ధర పడిపోవడం గమనార్హం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో ఉల్లి సాధారణ సాగు 19,789 హెక్టార్లు కాగా 20,490 హెక్టార్లలో సాగైంది. సెప్టెంబరులో 1,15,702 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు విపణికి వచ్చాయి. సోమవారం రికార్డు స్థాయిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 12,611 క్వింటాళ్ల దిగుబడులొచ్చాయి.

– న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

తూకం తప్పుతోంది

విపణిలో వేయింగ్ యంత్రాలకు ఈ.పాస్ యంత్రాలతో అనుసంధానం చేయకపోవడంతో తూకాల్లో అక్రమాలు జరుగుతున్నాయి. ఉల్లి 45 కిలోలకు ఖాళీ సంచి తూకం 300 గ్రాములతో కలిపి 45.300 కిలోలు తూకం వేయాలి. కానీ 45.600 కిలోలు, 46 కిలోలు.. ఇలా ఇష్టానుసారంగా తూకాలు ఉంటున్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 12,611 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి.. ఒక బస్తాపై 200-300 గ్రాముల లెక్కన క్వింటాకు అర కిలోకు పైగా తూకంలో మోసం జరుగుతోంది. మొత్తంమీద 30 క్వింటాళ్లకు పైగా ఎక్కువ తూకాలు వేసి రూ.లక్ష వరకు వ్యాపారులకు లాభం చేకూరుస్తున్నారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ.పాస్‌లను అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఆ దిశగా మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు.

సోమవారం మార్కెట్‌కు వచ్చిన దిగుబడులు



- మొత్తం లాట్లు : 389
- ప్యాకెట్లు: 28,024
- క్వింటాళ్లు : 12,611
- క్వింటా కనిష్ఠ ధర రూ. 297,
- మధ్యస్థ ధర రూ. 2,218,
- గరిష్ఠ ధర రూ. 3,660.

అనధికారిక వ్యక్తులదే రాజ్యం



అనధికారిక యువకుడు తూకం వేస్తూ..

ఈ చిత్రంలో వ్యక్తి.. నాగేశ్వరరావు అనే కమీషన్ ఏజెంటు కుమారుడు. ఇతను మిర్చి యార్డులోని షెడ్లలో ఉల్లి తూకాలు వేశారు. లైసెన్సు కలిగిన కాటాదారులు మాత్రమే తూకాలు వేయాలని నిబంధనలున్నాయి. కానీ అనధికారిక వ్యక్తులు, హమాలీలు.. ఇలా ఎవరుపడితే వారు తూకాలు వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. సరకు రికార్డు స్థాయిలో వచ్చినప్పుడు మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలి. కానీ ఉల్లి తూకాలు వేసే సమయంలో.. చివరికి సెక్యూరిటీ గార్డులు కనిపించడం లేదు.

మార్కెట్‌లో పచ్చిమోసం

– సుంకన్న, గోనెగండ్ల



నేను ఎకరా రూ.40 వేల చొప్పున మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి సాగు చేశా. కౌలు, పెట్టుబడులన్నీ కలిపి ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు వెచ్చించి ఉల్లి సాగు చేశా. నాణ్యమైన ఉల్లిని విపణికి తీసుకొస్తే క్వింటా రూ.1,967 పలికింది. మార్కెట్‌లో పచ్చిమోసం జరుగుతోంది. కోత కోసిన తర్వాత నాలుగు రోజులు ఆరబెట్టి తీసుకొచ్చా. బయట మార్కెట్‌లో క్వింటా రూ.3 వేలకు అడిగితే ఇవ్వలేదు. ఇక్కడికి వస్తే మొదటికే మోసం వచ్చింది. చివరికి వ్యాపారిని అడుక్కుని క్వింటా రూ.2 వేలకు అమ్మా.. 137.50 క్వింటాళ్లు విక్రయించగా రూ.50 వేల వరకు అప్పే మిగిలింది. ఇదే ఉల్లిని మా తమ్ముడు హైదరాబాదు మార్కెట్‌లో క్వింటా రూ.3,800కు ఈరోజే విక్రయించారు.

తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉదయం 5.30 గంటలకే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మొదలవ్వాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. పింఛన్ల పంపిణీ అంశంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన సోమవారం టెలీ కాన్ఫరెన్సులో సమీక్షించారు. పింఛన్ల పంపిణీలో ఏ ఒక్క మండలం కూడా వెనుకబడి ఉండకూడదని స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీ నగదు వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.



పండ్లు చూపుతున్న రైతు శ్రీనివాసులు

సీతాఫలం.. సిరులు ఘనం

రైతేరాజు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం మార్కెట్లో సీతాఫలాలు విరివిగా లభిస్తున్నాయి. మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులుగౌడ్ సీతాఫలం సాగు చేసి మంచి దిగుబడి సాధించారు. రాజమహేంద్రవరం నుంచి బాలానగర్ రకానికి చెందిన సీతాఫలం మొక్కలను 2021లో నాలుగు ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి 240 మొక్కలను 4.1 మీటర్ల వెడల్పుతో నాటారు. మొదట్లో ఎకరానికి రూ.70 వేలు ఖర్చు చేశారు. రెండేళ్ల తర్వాత ఎకరానికి రూ.30 వేలు చెట్ల కత్తిరింపు, కూలీలు, మందులకు ఖర్చు పెట్టారు. ఇటీవల కోతకు వచ్చాయి, రోజుకు 60 కిలోల పండ్లు అమ్ముతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.70కు విక్రయిస్తున్నారు. ఎకరానికి 6 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు శ్రీనివాసులుగౌడ్ పేర్కొన్నారు. సీతాఫలం తోటను ఉపాధి హామీ నిధులతో సాగు చేసినట్లు తెలిపారు. మొదటి ఏడాది 8 నెలలు, రెండు, మూడేళ్లలో 10 నెలలపాటు మొక్కకు రూ.14 చొప్పున ప్రతి నెలా ఇస్తారని ఆయన వివరించారు.



బెండ తోటలో రైతు ఉసేనాళం

బెండ.. రైతుకు అండ

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మాపురానికి చెందిన ఉసేనాళం బెండ సాగు చేశారు. దుక్కిని మెత్తగా దున్నుకోవాలి. దుక్కిలో డీఏపీ, వేప పిండి వేసుకోవాలి. నందికొట్కూరు నుంచి మహేంద్రరాజ రకం బెండ విత్తనాలు కొనుగోలు చేసి తెచ్చారు. 100 సెంట్లకు కిలో చొప్పున అడుగు దూరంలో నాటారు. మొత్తం 2 వేల మొలకలు ఉండాలి. వాటి మధ్యలో గడ్డి రాకుండా చూసుకోవాలి. 45 రోజుల తర్వాత కాయలు కోతకు వస్తాయి. ఒక్కో మొక్కకు రోజు తర్వాత రోజు 500 గ్రాముల వరకు దిగుబడి వస్తుంది. 90 రోజులపాటు కోత కోసే అవకాశముంది. ఎకరం బెండ సాగుకు రూ.20 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఖర్చులన్నీపోనూ రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని ఉసేనాళం తెలిపారు.



డా.రాఘవేంద్రచౌదరి, సమన్వయకర్త కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి

జాగ్రత్తలే నివారణ చర్యలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: పంటలలో తెగుళ్లను నివారణకు ఏ విధమైన జాగ్రత్తలు, ఎలాంటి మందులు వినియోగించుకోవాలనే అంశాలపై రైతులు డా.రాఘవేంద్రచౌదరిని ప్రశ్నలు అడిగారు. సమధానాలు ఆయన మాటల్లోనే

సమస్య : మిరపలో వేరుపురుగు వలన మొక్కలు చనిపోతున్నాయి. – శ్రీనివాసులు, అల్వాల

రాఘవేంద్రచౌదరి: వేర్ల రక్షణకు క్లోరిపైరిపాస్ 10జీ గుళికలు ఎకరానికి ఐదు కిలోలు లేదా థయోమిథాక్సమ్+ఫిప్రోనిల్ గుళికలు ఎకరానికి ఐదు కిలోలు వేసుకోవాలి.

సమస్య: వర్షాలకు పత్తి కాయ కుళ్లు అవుతోంది. – విరుపాక్షి, కోటేకల్


రాఘవేంద్రచౌదరి: కాయ కుళ్లిపోకుండా కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, ప్లాంటోమైసిన్ 0.2మి.లీ. లీటరు నీటిలో కలిపి కాయ తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి.

ఖర్చు పొదుపు.. సమయం అదుపు



పత్తిలో మందు పిచికారీ చేస్తున్న యంత్రం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఢణాపురం గ్రామానికి చెందిన రైతు నాగన్న ఏడాది కిందట పిచికారీ యంత్రంతో కూడిన ట్రాక్టర్‌ను తీసుకువచ్చారు. ట్రాక్టర్‌కు ప్రత్యేకంగా డ్రమ్ము, పిచికారీ యంత్రాలు, చిన్న చక్రాలు అమర్చారు. ట్రాక్టర్ రూ.10 లక్షలు, పరికరాలకు రూ.1.75 లక్షలు, ఇతర ఖర్చులు కలిపి రూ.12 లక్షలు వరకు పెట్టుబడి పెట్టారు. ఇందులో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇవ్వగా, బ్యాంకు రుణ సాయం పొందారు. సొంత పొలంతోపాటు అన్నదమ్ముల పొలం 30 ఎకరాల వరకు ఉంది. ట్రాక్టర్ యంత్రంతో తన పొలంతోపాటు ఇతర రైతుల పొలాల్లోనూ మందు పిచికారీ చేస్తున్నారు. గంటకు 10 ఎకరాలు, ఒక రోజుకు 50 నుంచి 60 ఎకరాలకు పిచికారీ చేస్తున్నట్లు నాగన్న పేర్కొన్నారు. ఎకరానికి పిచికారీ చేస్తే రూ.200 బాడుగ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక ఎకరంలో మనుషులు మందు కొట్టాలంటే ముగ్గురు కావాలి. ఒకరికి కనిష్ఠంగా రూ.300 లెక్కన రూ.900 అవుతుంది. ఈ యంత్రంతో సమయం ఆదాతోపాటు ఖర్చు తగ్గుతుందని వివరించారు.



వంకాయ తోట.. లాభాల పంట

మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతు రాము

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన తెలుగు రాము వంకాయ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. పంట యజమాన్య పద్ధతిలో తనకున్న 1.50 ఎకరం పొలంలో వంకాయ సాగు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో భూసారం పెంచేందుకు మూడు రోజులపాటు గొర్రెల (జీవాలు) మందను పొలంలో ఉంచారు. వాటి నుంచి వచ్చే విసర్జకాలు, మూత్రంతో భూమిని సారవంతం చేశారు. జీవాల ఎరువుతో పంటకు మంచి పోషకాలు అందడంతో దిగుబడి పెరుగుతుందన్నారు. గొర్రెల మందకు రోజుకు రూ.2 వేల చొప్పున ఖర్చు చేశారు. గూడూరు మండలం చనుగొండ్ల నర్సరీలో పెంచిన వంకాయ నారును కొనుగోలు చేశారు. పెట్టెలో సుమారు 100 మొక్కలుంటాయి. పెట్టె ధర రూ.60 ఉంటుంది. 1.50 ఎకరంలో 180 పెట్టెల నారను కొనుగోలు చేసి నాటారు. మొదట్లో మాత్రమే భూమందులు వాడారు. రెండు నెలలకు పంట దిగుబడి మొదలైంది. పంట చేతికొచ్చే వరకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టారు. కోతకు 100 గంపలు దిగుబడి తీస్తున్నారు. కర్నూలు మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు. దిగుబడులు మొదలయ్యాక పురుగు నివారణకు, కూలీల ఖర్చు ఉంటుంది. మూడు రోజులకొకసారి కోతలుంటాయి. ఆ సమయంలో మినహా బిందు పద్ధతిలో నీటిని అందించారు. ప్రస్తుతం పంట కోతలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ.2 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందన్నారు.

నువ్వా.. నేనా

☛ ఎంపీడీవోల బదిలీల్లో పట్టువీడని జడ్పీ ఛైర్మన్, సీఈవో

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంపీడీవోల బదిలీలపై నెలకొన్న వివాదం ఓ కొలిక్కి రావడం లేదు. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి ఎవరికివారు భీష్మించుకోవడంతో సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. సెప్టెంబరు 22వ తేదీకి బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా.. వీరిద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో బదిలీల ఉత్తర్వులు నిలిచిపోయాయి. జడ్పీలో తన ప్రమేయం లేకుండా బదిలీ ఉత్తర్వులు ఎలా విడుదల చేస్తారని ఛైర్మన్ వాదిస్తుండగా.. అధికార పార్టీకి చెందిన నేతలు చెప్పినట్లు కొన్ని చేయాల్సి ఉంటుందని, ఈ మాత్రం చేయకుంటే జడ్పీ పాలన సవ్యంగా సాగేందుకు అవకాశముండదని సీఈవో పేర్కొంటున్నారు.

గతంలో 12.. ఇప్పుడు 6

గత వారంలో జడ్పీ ఛైర్మన్, సీఈవోల మధ్య 12 మంది ఎంపీడీవోల బదిలీల్లో పేచి ఉండేది. ఉప సీఈవో సుబ్బారెడ్డి, ఎంపీడీవోల సంఘానికి చెందిన కొందరు వీరిద్దరి మధ్య గత నాలుగు రోజులుగా సయోధ్యకు చేసిన ప్రయత్నాలు కొంతమేర ఫలించాయి. ఈ నేపథ్యంలో 6 మండలాలకు సంబంధించి మాత్రమే భేదాభిప్రాయాలు ఉన్నాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న బనగానపల్లి నియోజకవర్గంలో 5 మండలాలతోపాటు డోన్ మండలంలో ఒక పోస్టింగుకు సంబంధించి సమస్య ఉంది. తాను జడ్పీ ఛైర్మన్‌గా ఉండీ సిఫారసు చేసే అధికారం లేదా అని ఛైర్మన్ అంటుండగా.. మంత్రి సైతం అదే పట్టుదలతో ఉండటంతోనే బదిలీల ప్రక్రియ తేలడం లేదు. బదిలీలకు సంబంధించిన గడువు ముగియనుండటంతో అక్టోబరు 2వ తేదీకి ఓ కొలిక్కి రానున్నట్లు తెలిసింది.

ముడుపులు.. సిఫారసు పత్రాలే అర్హత

☛ ఆబ్కారీ శాఖ బదిలీల్లో ఇదీ సంగతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ బదిలీల ప్రక్రియలో సిఫారసు పత్రాలు, ముడుపులు కీలకపాత్ర పోషించాయి. ఉమ్మడి జిల్లాలో 14 మద్య నిషేధ, ఆబ్కారీ స్టేషన్లు ఉన్నాయి. గతంలో అన్నీ స్టేషన్లకు మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నుంచి మామూళ్లు అందేవి. మరోసారి త్వరలో నూతన మద్యం పాలసీ విధానం అమలుకానున్న నేపథ్యంలో మళ్లీ మద్యం దుకాణాల నుంచి ప్రతినెలా మామూళ్ల పర్వం కొనసాగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు అధికారులు తమకు అవసరమైన స్థానాల కోసం పైరవీలు చేసుకున్నారు. అత్యధిక మద్యం దుకాణాలుండే పట్టణ ప్రాంతాల స్టేషన్లలో పోస్టింగుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. మంత్రులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు పత్రాలు తెచ్చుకుని చక్రం తిప్పారు. ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల సిఫారసు పత్రాలు తెచ్చుకున్న ఇద్దరు అధికారులు భంగపాటుకు లోనయ్యారు. ప్రధాన స్టేషన్లలో పోస్టింగులు దక్కించుకున్న అధికారులు.. కొందరు నేతలకు రూ.లక్షలు ముడుపుల ఇచ్చారన్న చర్చ జరుగుతోంది. బార్ నిర్వహిస్తున్న ఓ నాయకుడికి ఓ సీఐ ఏకంగా రూ.15 లక్షలు ఇచ్చినట్లు ప్రచారం ఉంది. పలువురు సీఐలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. ఒకే స్థానం కోసం ఇద్దరు ముగ్గురికి ప్రజాప్రతినిధులు సిఫారసు పత్రాలు ఇవ్వటంతో ఎవరికి పోస్టింగు ఇవ్వాలో తెలియక ఉన్నతాధికారులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది.

ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళం

- ముగిసిన సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల ఒప్పందం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఈ దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల ఒప్పందం సోమవారంతో ముగిసింది. నూతన మద్యం పాలసీ అమలుకు కొద్ది రోజులు పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మరో వారం రోజులు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో పని చేసే సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లలో అధిక శాతం మంది తాము విధులకు రాలేమని తేల్చి చెప్పినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ గత కొంత కాలంగా వీరు డిమాండ్ చేస్తున్నారు.. మరోవైపు విధులకు హాజరుకావాలంటూ అధికారులు పలువిధాలా వారికి నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. విషయాన్ని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. వీలైనన్ని చోట్ల ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. అక్రమ మద్యం ప్రభావం పడకుండా.. బార్లలో మద్యం లోటు లేకుండా నిల్వ చేసి అమ్మకాలు జరపాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆబ్కారీ శాఖ అధికారులు బార్లలో మద్యం సరకు తరలించే ఏర్పాటు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో బార్లు లేకపోవటం, ఉన్నచోట బార్లలో అధిక ధరలకు మద్యం విక్రయించనున్న నేపథ్యంలో అక్రమ మద్యం ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

నంద్యాల విద్యుత్తు సర్కిల్‌కు అధికారుల కేటాయింపు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం పరిధిలో నంద్యాల జిల్లాకు కొత్తగా ఆపరేషన్ సర్కిల్‌ను ఏర్పాటుచేస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలువురు ఉన్నతాధికారులు, సిబ్బందిని నంద్యాలకు కేటాయిస్తూ సీఎండీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. విద్యుత్తు శాఖ నంద్యాల ఆపరేషన్ సర్కిల్‌కు జీఎం/ఎస్ఈ-1, ఈఈలు-4; డీఈఈలు-20, అకౌంట్స్ అధికారి-1, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి-1, పర్సనల్ అధికారి-1ని కేటాయించారు. ఏఈ/ఏఈఈ, జేఈ, జేఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగులకు సంబంధించి నియామకం కమిటీ ద్వారా నిర్ణయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నంద్యాల డివిజన్ కార్యాలయాన్నే ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంగా వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆబ్కారీ కానిస్టేబుళ్లకు పదోన్నతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖలో ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ నోడల్ పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందినవారిలో రాజు (ఛత్రగుడి చెక్‌పోస్టు), లక్ష్మన్న (ఎమ్మిగనూరు స్టేషన్), చెన్నయ్య (ఆలూరు), రామకృష్ణుడు (డోన్), మదన్‌మోహన్ (పత్తికొండ స్టేషన్), జగన్నాథం (ఐఎంఎల్ డిపో), లక్ష్మన్న (ఐఎంఎల్ డిపో) ఉన్నారు. వీరిని వేర్వేరు స్థానాలకు బదిలీ చేశారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 68 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 136 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగిస్తూ ఆ శాఖ నోడల్ పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కర్నూలు జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. వివిధ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడం.. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా 106 చెరువులకు నీరు నింపేలా చర్యలు తీసుకోకపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా జనం వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో నగరాభివృద్ధి

☛ చర్చించిన అంశాల్లో పురోగతి లేకుంటే చర్యలు

- మంత్రి టీజీ భరత్

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : సమగ్ర ప్రణాళికతో నగరాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులోని ప్రభుత్వ అతిథి గృహంలో నగరపాలక అధికారులతో సోమవారం సమీక్షించారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీశారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించాలన్నారు. జగన్నాథగట్టు సమీపంలో టిడ్కో గృహ సముదాయాల వద్ద అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆర్టీసీ బస్సులు నడిపేలా ఆర్ఎంతో మాట్లాడాలని సూచించారు. 23, 24వ వార్డుల్లో సుద్ద వాగు వద్ద రక్షణ వలయం ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల విస్తరణ చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంకల్‌బాగ్, రాజ్‌విహార్ ఎల్లమ్మ దేవాలయం నుంచి ఒకటో పట్టణం వరకు బండ్ రహదారులు నిర్మించాలన్నారు. బిర్లాగడ్డ రైల్వే వంతెన కింద మురుగు నిలవకుండా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, ఉన్నవి సక్రమంగా నిర్వహించేలా చూడాలని పేర్కొన్నారు. కొండారెడ్డి బురుజు సమీపంలో కూడలి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాల్లో పురోగతి ఉండాలని.. లేకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యాధికారి విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

● ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానం తీసుకొస్తోందని.. కర్నూలులో ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలని మంత్రి టీజీ భరత్ సూచించారు. టెండర్లు వేశాం.. నష్టపోయామంటూ ధరలు పెంచి అమ్మకూడదని పేర్కొన్నారు.

పెద్దాసుపత్రిలో రోగుల విలవిల

☛ న్యూరోసర్జరీ ఓటీలో పనిచేయని ఏసీలు



న్యూరోసర్జరీ ఓటీలో ఫ్యాన్ ఏర్పాటుచేసుకుని చికిత్స చేస్తున్న వైద్యుడు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలోని న్యూరోసర్జరీ విభాగంలో ఏసీలు పనిచేయకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. దాదాపు మూడు నెలలుగా పనిచేయకపోయినా ఆస్పత్రి అధికారులు పట్టించుకోవడం లేదు. ఓటీలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సుమారు 5 శస్త్రచికిత్సలు చేస్తుండగా.. ఏసీలు పనిచేయకపోవడంతో రెండు, మూడు ఆపరేషన్లకే పరిమితమైంది. ఫ్యాన్ పెట్టి ఆపరేషన్లు చేస్తున్నా అసౌకర్యంగా ఉండటంతో వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

☛ 40 మందికి గాయాలు



చిన్నారిని పరామర్శిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు నగరపాలక సంస్థ, కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు పాతనగరం, ఒకటో పట్టణంలో వీధి కుక్కలు సోమవారం స్వైరవిహారం చేశాయి. సుమారు 40 మందిపై దాడి చేసి గాయపరిచాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను అప్రమత్తం చేసి ఆసుపత్రికి వెళ్లారు. బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు కర్నూలు నగరపాలక సంస్థ తరపున రూ.10 వేలు అందిస్తామని ప్రకటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జంతు ప్రేమికురాలు మేనకాగాంధీ ఇలాంటి ఘటనలు జరగకుండా పరిష్కార మార్గాలు చెప్పాలని పేర్కొన్నారు. వీధి కుక్కల సమస్యకు సంబంధించి కుటుంబ నియంత్రణ కోసం శస్త్రచికిత్సలు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కల్లూరు పరిధి.. ఆసిఫ్ నగర్‌లోని సర్వే నంబరు 227/ఎ3లో 114 ప్లాట్లు ఉన్నాయని, వాటిపై కబ్జాదారుల కన్నుపడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి స్థలాలు కాపాడాలని కోరుతూ సోమవారం బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ 2011లో ఆసిఫ్ నగర్‌లో స్థలాలు కొనుగోలు చేశామని తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు వచ్చి ప్లాట్లకు సంబంధించిన రాళ్లు తొలగించి ఎవరినీ లోనికి రానీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటువైపు వెళ్తే కబ్జాదారులు భయపెడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ

జీవో 117 రద్దు చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై డీటీఎఫ్ ఆధ్వర్యంలో 2వ తేదీన నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ తెలిపారు. నగరంలోని టౌన్‌మోడల్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంగ్లంతో పాటు మాతృ భాష మాధ్యమం కొనసాగించాలన్నారు. పాత పింఛను విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు, జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో యువత భాగస్వామ్యం పెరగాల్సి ఉందని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టరు పి.సుబ్బారెడ్డి అన్నారు. కర్నూలు వెంకటరమణ కాలనీలోని చిన్మయ మిషన్ కేంద్రంలో రూ.25 లక్షలతో ఆధునికీకరించిన రెండో అంతస్తు భవనాన్ని మిషన్ బాధ్యులు సుప్రేమానందతో కలిసి సోమవారం ప్రారంభించారు. చిన్మయ మిషన్ భవనానికి రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చిన సుబ్బారెడ్డిని విశ్రాంత ఎస్ఈ నరసింహారెడ్డి అభినందించారు. సుప్రేమానంద మాట్లాడుతూ ప్రతి ఆదివారం చిన్నారులకు ఆధ్మాత్మిక అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి, చిత్రంలో విశ్రాంత ఎస్ఈ నరసింహారెడ్డి, సుప్రేమానంద తదితరులు

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: సమస్య: ఆదోని పట్టణ శివారు కోట వెంకటేశ్వరస్వామి ఆలయ పక్కన రహదారిలో మురుగు ప్రవాహం భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. **- రాజకుమార్, ఆదోని**

సమాధానం: ఆ ప్రాంతంలో పర్యటించి, సమస్య పరిశీలించి పరిష్కరిస్తాం.
- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

చిప్పగిరి, న్యూస్‌టుడే: సమస్య: నంచర్లలో కాల్వలు లేక మురుగంతా రహదారులపైకి చేరుతోంది. సీసీ రహదారులతో పాటు కాల్వలు ఏర్పాటు చేయాలి. **- ఇబ్రహీం, నంచర్ల**

సమాధానం: సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. త్వరలో సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మిస్తాం.
- భీమ, సర్పంచి నంచర్ల

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చిప్పగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలకు చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.ప్రవీణ్‌కుమార్ ఎంపికైనట్లు ప్రధానాచార్యులు వరదరాజులు సోమవారం తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌ను పీడీ సుధీర్, అధ్యాపకులు అభినందించారు.

రాయితీపై శనగ విత్తనాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మండలానికి 900 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి అక్బర్‌బాషా తెలిపారు. రైతుకు క్వింటం రూ.7,050 చొప్పున అందిస్తున్నామన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ఈ నెల 3వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసి..

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: పురవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు.. కుర్చీల కోసం గొడవలు పడడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వై.సాయినాథ్, జిల్లా నాయకులు దిలీప్‌దోకా అన్నారు. ఆదోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బీసీ మహిళ పట్ల కొందరు అమర్యాదగా ప్రవర్తించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మారుతిరావు, వీరేశ్, నిత్ తదితరులు పాల్గొన్నారు.





అర్జీలు గడువులోగా పరిష్కరించండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిణి వసుంధర అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం నిర్వహించారు. వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సత్యవతి, ఆర్డీవో నాగేంద్ర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వేణు సూర్య, డీఎల్‌పీవో కార్యాలయ ఏవో వీరభద్రప్ప, తదితరులు పాల్గొన్నారు. కొద్దిసేపు సబ్ కలెక్టర్ భరద్వాజ్ ప్రజా సమస్యల పరిష్కర వేదికలో పాల్గొని అనంతరం పత్తికొండకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాట్ల కోసం వెళ్లినట్లు కార్యాలయ వర్గాలు తెలిపారు.



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజలతో మమేకం కావాలి

హాలహర్వి, న్యూస్‌టుడే: ప్రజలతో మమేకమై, సేవలు అందించినప్పుడే మన ఉద్యోగానికి సార్థకత ఉంటుందని తహసీల్దారు నజ్మీబాను, ఉప తహసీల్దారు లక్ష్మి అన్నారు. బేవినహల్ గ్రామ వీఆర్వో వెంకటకృష్ణుడు సోమవారం పదవీ విరమణ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వీఆర్వో దంపతులను సన్మానిస్తున్న అధికారులు

వాల్మీకి జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలి

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి(వీఆర్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభీంనాయుడు డిమాండు చేశారు. ఆదోనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు నీలకంఠ, నాయకులు హనుమన్న, భాస్కర్, పెద్దయ్య, ముని, వెంకటేశు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.











పండ్లు చూపుతున్న రైతు శ్రీనివాసులు

సీతాఫలం.. సిరులు ఘనం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం మార్కెట్లో సీతాఫలాలు విరివిగా లభిస్తున్నాయి. బనగానపల్లి మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులుగౌడ్ సీతాఫలం సాగు చేసి మంచి దిగుబడి సాధించారు. రాజమహేంద్రవరం నుంచి బాలానగర్ రకానికి చెందిన సీతాఫలం మొక్కలను 2021లో నాలుగు ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి 240 మొక్కలను 4.1 మీటర్ల వెడల్పుతో నాటారు. మొదట్లో ఎకరానికి రూ.70 వేలు ఖర్చు చేశారు. రెండేళ్ల తర్వాత ఎకరానికి రూ.30 వేలు చెట్ల కత్తిరింపు, కూలీలు, మందులకు ఖర్చు పెట్టారు. ఇటీవల కోతకు వచ్చాయి, రోజుకు 60 కిలోల పండ్లు అమ్ముతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.70కు విక్రయిస్తున్నారు. ఎకరానికి 6 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు శ్రీనివాసులుగౌడ్ పేర్కొన్నారు. సీతాఫలం తోటను ఉపాధి హామీ నిధులతో సాగు చేసినట్లు తెలిపారు. మొదటి ఏడాది 8 నెలలు, రెండు, మూడేళ్లలో 10 నెలలపాటు మొక్కకు రూ.14 చొప్పున ప్రతి నెలా ఇస్తారని ఆయన వివరించారు.



బెండ తోటలో రైతు ఉసేనాళం

రైతేరాజు

బెండ.. రైతుకు అండ

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఉసేనాళం బెండ సాగు చేశారు. దుక్కిని మెత్తగా దున్నుకోవాలి. దుక్కిలో డీఏపీ, వేప పిండి వేసుకోవాలి. నందికొట్కూరు నుంచి మహేంద్రరాజ రకం బెండ విత్తనాలు కొనుగోలు చేసి తెచ్చారు. 100 సెంట్లకు కిలో చొప్పున అడుగు దూరంలో నాటారు. మొత్తం 2 వేల మొలకలు ఉండాలి. వాటి మధ్యలో గడ్డి రాకుండా చూసుకోవాలి. 45 రోజుల తర్వాత కాయలు కోతకు వస్తాయి. ఒక్కో మొక్కకు రోజు తర్వాత రోజు 500 గ్రాముల వరకు దిగుబడి వస్తుంది. 90 రోజులపాటు కోత కోసే అవకాశముంది. ఎకరం బెండ సాగుకు రూ.20 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఖర్చులన్నీపోనూ రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని ఉసేనాళం తెలిపారు.



డాక్టర్ రాఘవేంద్రచౌదరి, సమన్వయకర్త కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి

జాగ్రత్తలే నివారణ చర్యలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : పంటలలో తెగుళ్లను నివారణకు ఏ విధమైన జాగ్రత్తలు, ఎలాంటి మందులు వినియోగించుకోవాలనే అంశాలపై రైతులు డా.రాఘవేంద్రచౌదరిని ప్రశ్నలు అడిగారు. సమధానాలు ఆయన మాటల్లోనే

సమస్య : మిరపలో వేరుపురుగు వలన మొక్కలు చనిపోతున్నాయి. **– శ్రీనివాసులు, అల్వాల**

రాఘవేంద్రచౌదరి: వేర్ల రక్షణకు క్లోరిపైరిపాస్ 10జీ గుళికలు ఎకరానికి ఐదు కిలోలు లేదా థయోమిథాక్సమ్+ఫిప్రోనిల్ గుళికలు ఎకరానికి ఐదు కిలోలు వేసుకోవాలి.

సమస్య: వర్షాలకు పత్తి కాయ కుళ్ళు అవుతోంది. **- విరుపాక్షి, కోటేకల్**

రాఘవేంద్రచౌదరి: కాయ కుళ్లిపోకుండా కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, ప్లాంటోమైసిన్ 0.2మి.లీ. లీటరు నీటిలో కలిపి కాయ తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి.

ఖర్చు పొదుపు.. సమయం అదుపు



పత్తిలో మందు పిచికారీ చేస్తున్న యంత్రం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఢణాపురం గ్రామానికి చెందిన రైతు నాగన్న ఏడాది కిందట పిచికారీ యంత్రంతో కూడిన ట్రాక్టర్‌ను తీసుకువచ్చారు. ట్రాక్టర్‌కు ప్రత్యేకంగా డ్రమ్ము, పిచికారీ యంత్రాలు, చిన్న చక్రాలు అమర్చారు. ట్రాక్టర్ రూ.10 లక్షలు, పరికరాలకు రూ.1.75 లక్షలు, ఇతర ఖర్చులు కలిపి రూ.12 లక్షలు వరకు పెట్టుబడి పెట్టారు. ఇందులో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇవ్వగా, బ్యాంకు రుణ సాయం పొందారు. సొంత పొలంతోపాటు అన్నదమ్ముల పొలం 30 ఎకరాల వరకు ఉంది. ట్రాక్టర్ యంత్రంతో తన పొలంతోపాటు ఇతర రైతుల పొలాల్లోనూ మందు పిచికారీ చేస్తున్నారు. గంటకు 10 ఎకరాలు, ఒక రోజుకు 50 నుంచి 60 ఎకరాలకు పిచికారీ చేస్తున్నట్లు నాగన్న పేర్కొన్నారు. ఎకరానికి పిచికారీ చేస్తే రూ.200 బాడుగ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక ఎకరంలో మనుషులు మందు కొట్టాలంటే ముగ్గురు కావాలి. ఒకరికి కనిష్ఠంగా రూ.300 లెక్కన రూ.900 అవుతుంది. ఈ యంత్రంతో సమయం ఆదాతోపాటు ఖర్చు తగ్గుతుందని వివరించారు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతు రాము

వంకాయ తోట.. లాభాల పంట

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన తెలుగు రాము వంకాయ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. పంట యజమాన్య పద్ధతిలో తనకున్న 1.50 ఎకరం పొలంలో వంకాయ సాగు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో భూసారం పెంచేందుకు మూడు రోజులపాటు గొర్రెల (జీవాలు) మందను పొలంలో ఉంచారు. వాటి నుంచి వచ్చే విసర్జకాలు, మూత్రంతో భూమిని సారవంతం చేశారు. జీవాల ఎరువుతో పంటకు మంచి పోషకాలు అందడంతో దిగుబడి పెరుగుతుందన్నారు. గొర్రెల మందకు రోజుకు రూ.2 వేల చొప్పున ఖర్చు చేశారు. గూడూరు మండలం చనుగొండ్ల నర్సరీలో పెంచిన వంకాయ నారును కొనుగోలు చేశారు. పెట్టెలో సుమారు 100 మొక్కలుంటాయి. పెట్టె ధర రూ.60 ఉంటుంది. 1.50 ఎకరంలో 180 పెట్టెల నారను కొనుగోలు చేసి నాటారు. మొదట్లో మాత్రమే భూమందులు వాడారు. రెండు నెలలకు పంట దిగుబడి మొదలైంది. పంట చేతికొచ్చే వరకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టారు. కోతకు 100 గంపలు దిగుబడి తీస్తున్నారు. కర్నూలు మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు. దిగుబడులు మొదలయ్యాక పురుగు నివారణకు, కూలీల ఖర్చు ఉంటుంది. మూడు రోజులకొకసారి కోతలుంటాయి. ఆ సమయంలో మినహా బిందు పద్ధతిలో నీటిని అందించారు. ప్రస్తుతం పంట కోతలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ.2 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందన్నారు.

పశ్చిమ తీరం.. సమస్యలతో జాగారం

◆ ఏళ్ల తరబడి పరిష్కారమేదీ..?
◆ చంద్రబాబు రాక సందర్భంగా స్థానికుల నివేదన



ముళ్లపొదలు పెరిగిన హంద్రీనీవా కాలువ

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: జిల్లాలోని పశ్చిమ తీరం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. భీకర కరవు ఛాయలు వెంటాడుతున్నాయి. తాగునీరు గొంతుకు... ఉన్నత విద్య వ్యాసానికి ఆటంకాలు. కర్షకుల ఉపాధి అందని కొలువులు. కష్టపడి పండించిన పంటలకు దక్కని ధరలు... ఇవీ పశ్చిమ ప్రాంత వాసులు నిత్యం ఎదుర్కొనే సమస్యలు. తమ గోడు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును పత్తికొండ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గత పాలకులు హామీలు ఇచ్చి, అధికారం వచ్చాక ఆ విషయాన్ని పెడచెవిన పెట్టారు. విద్యార్థులకు సాంకేతిక దారి చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల పంట పండేనట్లు..

పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని కృష్ణగిరి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర మండలాల మీదుగా 80 కి.మీ. మేర హంద్రీనీవా విస్తరించింది. పదసర ప్రాంత రైతులకు పంట కాల్వల నిర్మాణం చేపట్టి పూర్తిచేస్తే.. నీరంది ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. పందికోన జలాశయం సామర్థ్యం పెంపుతో పాటు, కుడి, ఎడమ కాల్వలు పూర్తిచేస్తే ఈ ప్రాంతంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించే వీలుంటుంది.

సాంకేతిక విద్య.. అందని ద్రాక్ష

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఈ ప్రాంత యువత సాంకేతిక విద్య(పాలిటెక్నిక్) చదివేందుకు కళాశాల లేదు. ఇక్కడ అధికారం చేపట్టగానే పాలిటెక్నిక్ కళాశాల నిర్మిస్తామని...



మద్దికెర- పత్తికొండ మధ్య అధ్వానంగా రహదారి

దారులు దారుణం

పత్తికొండ నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వాన్నంగా మారాయి. అడుగుకో గుంతతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు. మద్దికెర- పత్తికొండ, తుగ్గలి- బొందిమడుగుల ప్రధాన రహదారుల్లో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నియోజకవర్గంలోని పలు రహదారులకు కూడా మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు.

టమాట తప్పారు

పత్తికొండ ప్రాంతంలో టమాట జ్యూస్ పరిశ్రమ నిర్మాణం చేపడతామని గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. ఎన్నికలు సమీపించడంతో బండరాళ్లన్న కొండపై మొక్కుబడి పనులు చేపట్టి ఈ ప్రాంత రైతులను నమ్మించే ప్రయత్నం చేశారు. ఇక్కడ ఎలాంటి పనులు జరగలేదు. కొత్త ప్రభుత్వమైనా దీనిపై వెంటనే దృష్టి సారించాలని కోరుతున్నారు.




పత్తికొండలో టమాట జ్యూస్ ప్రాసెసింగ్ కేంద్రం కోసం ఎంపిక చేసిన స్థలం ఇదే

భక్తిశ్రద్ధలతో ఎల్లార్తి ఉరుసు

ఎల్లార్తి (హొళగుంద), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన హొళగుంద మండలంలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి సాహెబ్ ఉరుసు ఉత్సవాలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో సాగాయి. అంతకు ముందు ఆదివారం రాత్రి దర్గా మత పెద్ద ఇంటి నుంచి సాహెబ్ల గంధాన్ని పీఠాధిపతి నూరుబాషా తలపై మోసుకొని ఊరేగింపుగా వచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు అందజేశారు. సాహెబ్ల గంధం కార్యక్రమ వక్ఫ్ బోర్డు అధికారులు, వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో జరిగింది. ఆలూరు తెదేపా బాధ్యుడు వీరభద్రగౌడు ఉరుసు కార్యక్రమంలో పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, నేతృత్వంలో హొళగుంద, హాలహర్వి ఎస్సైలు బాల సింహులు, చంద్ర, ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



గంధాన్ని తీసుకొస్తున్న పీఠాధిపతి



ప్రత్యేక అలంకరణలో దర్గా

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

ఆలూరు, న్యూస్‌టుడే: కృషి, పట్టుదల, సాధించాలనే తపన ఉంటే లక్ష్యం సాధించవచ్చని ఆలూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెంజడప్ప అన్నారు. వైజాగ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన మధుతో పాటు తండ్రి బసవరాజును, ఉపాధ్యాయుడు హనుమంతరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కవిరాజు సోమవారం స్థానిక కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రూ.5 వేల చెక్కు అందజేశారు. బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సరోజను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



మధును సత్కరిస్తున్న కరస్పాండెంట్ కెంజడప్ప, తదితరులు

విలువలతో కూడిన బోధన సాగించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన కొనసాగించాలని మండల విద్యాధికారులు కోమలాదేవి, చిరంజీవిరెడ్డి అన్నారు. ఆలూరు మండలం అరికెర అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పదవీ విరమణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కుటుంబీకులు, బంధువులు, మిత్రులు సత్కరించారు.



ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి దంపతులను సత్కరిస్తున్న విద్యాధికారులు, ఉపాధ్యాయులు

కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆదోని బాధ్యుడు మీనాక్షినాయుడు అన్నారు. ఆదోనిలో తెదేపా కార్యాలయంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యకర్తలు, నాయకులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు, భూత్ కన్వీనర్లుతో చర్చించారు. ఎన్నికల ముందు వచంద్రబాబు తనకు ఇచ్చిన హామీ నెరవేరుస్తారనే నమ్మకం ఉందన్నారు. సమావేశంలో తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, తెదేపా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, నాయకులు బసవరాజు, రామస్వామి, అప్సర్‌బాష, మారుతినాయుడు, శ్రీనివాస ఆచారి, బుద్ధారెడ్డి, రంగన్న, ఉమ్మిసలీం, శ్రీకాంత్‌రెడ్డి, దేవేంద్రప్ప, శివప్ప, గోపాల్‌రెడ్డి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, వెంకటేశ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు

స్తంభించిన రాకపోకలు.. నీట మునిగిన పంటలు



ఆస్పరి- జోహరాపురం గ్రామాల మధ్య నల్లవాగు వద్ద నిలిచిన రాకపోకలు

ఆస్పరి, న్యూస్‌టుడే: ఒక్కసారిగా సోమవారం కుండ పోత వర్షం కురవడంతో రైతుల పొల్లాలు నీట మునిగాయి. వాగులు వంకలు పొంగి పొర్లి రాకపోకలు స్తంభించాయి. ఆస్పరి నుంచి జోహరాపురానికి గంటల తరబడి రాకపోకలు స్తంభించాయి. మిరప, కంది, బీర పంటలు పూర్తిగా నీట మునిగాయి.

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆకాల వర్షంతో ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పంట దిగుడులు తడిసిపోయాయి. 11 వేల బస్తాల వేరుశనగ వచ్చింది. బయట రాశులుగా పోసిన వేరుశనగ తడిసి బురదమయంగా మారింది. పత్తి యార్డులో షెడ్ల ఆరబయట ఉంచిన పత్తి దిగుబడులకు సైతం వర్షం ఇబ్బందులు తప్పలేదు. దీంతో వ్యాపారులు తూకాలలో బస్తాకు రెండు, మూడు కిల్లోలు తగ్గించి తీసుకున్నారని రైతులు వాపోయారు.



వేరుశనగ బస్తాల కిందకు చేరిన వర్షం నీరు



తడిసిన పత్తి దిగుబడులు



కుప్పకూలిన నీటి ట్యాంకు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామంలో సోమవారం ఓవర్ హెడ్ ట్యాంకు కుప్పకూలింది. కూలిన సమయంలో జన సంచారం ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పాఠశాల విద్యార్థులు కొన్ని నిమిషాల ముందు ట్యాంకు ముందు నుంచి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. 2006లో నిర్మించిన ట్యాంకు శిథిలావస్థకు చేరి నేలమట్టం అయింది. కొన్నేళ్లుగా అధికారులను కోరుతున్నా కూల్చలేదని గ్రామస్థులు తెలిపారు. కూలే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదన్నారు.

కౌన్సిల్‌లో కుర్చీల కొట్లాట

○ కన్నీటి పర్యంతమైన ఛైర్‌పర్సన్ శాంత ○ ఎమ్మెల్యే, వైకాపా కౌన్సిలర్ల మాటల యుద్ధం



పోడియంను చుట్టుముట్టి, నిలదీస్తున్న వైకాపా సభ్యులు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం సోమవారం వాడీవేడీగా సాగింది. నిరసనలు, ఆందోళనతో గందరగోళంగా మారింది. పురపాలక ఛైర్‌పర్సన్ శాంత అధ్యక్షతన సమావేశం ప్రారంభమవగానే వైకాపా వైస్ ఛైర్మన్లు మహమ్మద్‌గౌడ్, నరసింహుల కుర్చీల స్థానం మార్చడంతో కౌన్సిలర్లు నిరసన తెలుపుతూ.. ఛైర్‌పర్సన్‌తో పాటు కమిషనర్ కృష్ణను చుట్టుముటి అభ్యంతరం తెలిపారు. ఇంతకాలం కౌన్సిల్ సమావేశంలో వైస్‌ఛైర్మన్లకు ప్రత్యేకంగా ఉన్న కుర్చీలను తొలగించి, సభ్యులతో కూర్చొమనడంతో భగ్గుమన్నారు. ఇంత కాలం లేని మార్పు ఇప్పుడెందుకు తెచ్చారని, దీని వెనుక ఎవరున్నారు, కారణాలు చెప్పాలని గట్టిగా పట్టుబట్టారు. తమను అగౌరవపర్చారని, అలాంటప్పుడు తమకు కుర్చీలు వద్దని.. నేలపైనే కూర్చున్నారు. ఇంతలో పోలీసులు కౌన్సిల్ హాల్‌లోకి ప్రవేశించి సభ్యులను వారించే ప్రయత్నం చేశారు. పోలీసులు రావడాన్ని వైకాపా సభ్యులు తప్పుపట్టారు. వైకాపా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ సభ్యుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఇంతలో ఎమ్మెల్యే పార్థసారథి సభలో వచ్చి కూర్చోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరికి ఛైర్‌పర్సన్, అధికారులు కుర్చీలు ప్రత్యేకంగా వేసేలా చేస్తామని పేర్కొనడంతో సభ్యులు శాంతించి కుర్చీలో కూర్చోవడంతో సభ కొనసాగింది. సమావేశంలో కమిషనర్ కృష్ణ, సహాయ కమిషనర్ అనుపమ, ఎంఈ ఇంతియాజ్ ఆలీ, డీఈ, ఏఈలు, వివిధ విభాగాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పదవి నుంచి తప్పించాలని కుట్ర

పురపాలక ఛైర్‌పర్సన్ శాంత సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. తాను ఎవ్వరినీ బాధపెట్టలేదని, కించపరచలేదని.. తనను పదవి నుంచి దించాలని కుట్ర చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారానని ఆరోపిస్తున్నారని అన్నారు. చివరికి తన హయాంలో వేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై కూడా తన పేరును ధ్వంసం చేస్తున్నారని సభలో కన్నీరు పెట్టుకున్నారు. శిలాఫలకాలపై పేర్లు ధ్వంసం చేయడాన్ని పలువురు కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్యే ఖండించారు. ఇలాంటివి సహించమని, ఛైర్‌పర్సన్ పేర్లు ధ్వంసం కాకుండా చూడాలని పురపాలక అధికారులను ఆదేశించారు.

సలహాలు ఇవ్వాలితప్ప.. జోక్యం చేసుకోరాదు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశంలో సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి, వైకాపా వార్డు కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేకంగా పట్టణంలో మురుగు కాలువల పూడికతీత పనుల కోసం తీసుకొచ్చిన రూ.1.24 కోట్లు పనులతో పాటు కౌడల్‌పేట, అరుణ్‌జ్యోతినగర్‌లో రహదారుల నిర్మాణాన్నికి ఎమ్మెల్యే సిఫారసు చేస్తూ ప్రతిపాదించి అజెండాలో పొందుపరచిన రెండు పనులకు అభ్యంతరం తెలుపుతూ వైకాపా సభ్యులు ఆమోదించలేదు. పట్టణంలో వైకాపా హయాంలో ఎన్నికల ముందు రూ.33 కోట్లతో చేపట్టిన పురపాలక వాణిజ్య సముదాయ నిర్మాణ పనుల బిల్లులు, ప్రస్తుత కౌన్సిల్ అజెండాలో లేకపోవడంతో వైకాపా సభ్యులు ప్రత్యేకంగా ఆర్జీ రాసి ప్రస్తూత అజెండా పొందుపరచి ఆమోదించాలని కోరి, సంతకాలు చేసి ఛైర్‌పర్సన్‌కు ఇచ్చారు. దీంతో పాటు అన్న క్యాంటీన్ల రూ.36 లక్షల బిల్లులకు వైకాపా సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంతలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని.. వైకాపా, తెదేపా ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అభ్యంతరం తెలిపారు. వైస్ ఛైర్మన్ నరసింహులు జోక్యం చేసుకుని ఎమ్మెల్యే కేవలం సలహాలివ్వాలి తప్ప, వేరే విషయాలు మాట్లాడకూడదన్నారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. తాను కో-ఆప్షన్ సభ్యుడినని, కౌన్సిల్‌లో మాట్లాడే హక్కు నాకు ఉందన్నారు. బెదిరింపు రాజకీయాలకు భయపడేదిలేదన్నారు. దీనిపై విచారణ చేయిస్తామని, సభ్యులు కలిసిరావాలన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథి, వైస్ ఛైర్మన్ నరసింహులు వాగ్వాదం

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

కర్ణాటక పర్యటనలో శ్రీమఠం పీఠాధిపతి



కర్ణాటకలో శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం, న్యూస్‌టుడే : ధార్మిక పర్యటన నిమిత్తం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లిన శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులకు కర్ణాటక భక్తులు, సోదె వాదిరాజ మఠం పీఠాధిపతి విశ్వవల్లభ తీర్థులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం వాదిరాజ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వాదిరాజ మూల బృందావనాన్ని దర్శించుకుని హారతి ఇచ్చారు. భక్తులకు పల మంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజ అప్రయే ఆచార్, మఠం దావన్‌లు, మఠం సిబ్బంది ఉన్నారు.

4న ఎమ్మిగనూరులో జాబ్‌మేళా

గోనెగండ్ల , న్యూస్‌టుడే : ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 4వ తేదీన నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. పది, ఇంటరు, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, చదివిన నిరుద్యోగులు హాజరై జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

సి.బెళగల్ , న్యూస్‌టుడే: **సమస్య :** కొత్తకోట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎత్తిపోతల పతకాన్ని ప్రారంభించి రైతుల సమస్యలను తీర్చాలి.
- శ్రీనివాసులు కొత్తకోట

సమాధానం : త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాము. **- ఐడీసీ డీఈఈ నాగార్జున**

సమస్య : కె. శింగవరంలో బస్టాండులో బస్సు షెల్టరు లేక వర్షాకాలం, వేసవి కాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- రామచంద్రరెడ్డి కె.శింగవరం గ్రామం

సమాధానం : సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాము. - ఎంపీడీవో రాముడు సి. బెళగల్ **సమస్య :** తిమ్మందొడ్డి గ్రామం నుంచి చింతమానుపల్లె వరకు బీటీ రహదారిని నిర్మించండి.
- ప్రతాపురెడ్డి చింతమానుపల్లె

సమాధానం : సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాము. **- ఎంపీడీవో రాముడు సి.బెళగల్**

సమస్య : మారందొడ్డి గ్రామంలో ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించండి. **- సుందరము మారందొడ్డి**

సమాధానం: సమస్యను సంబంధితాధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **- ఎంపీడీవో రాముడు సి.బెళగల్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య :** మండలంలోని గవిగట్టు గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-గవిగట్టు, బాపులదొడ్డి**

సమాధానం : పంచాయతీ నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం.
- జనార్ధన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కోడుమూరు ఆబ్కారీ శాఖ సీఐగా ఎం. మంజులా



బాధ్యతలు చేపట్టిన సీఐ మంజులను సత్కరిస్తున్న సీఐ రామాంజనేయులు, సిబ్బంది

సోమవారం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బద్వేలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఆమె వివరించారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన సీఐ రామాంజనేయులు బదిలీపై నందికొట్కూరుకి వెళ్తుండటంతో ఆ శాఖ సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎస్సై అలిబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్‌ఫ్రెడ్ రాజుకు బ్రాహ్మణ సంఘం సన్మానం

మంత్రాలయం, న్యూస్‌టుడే : క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఆల్‌ఫ్రెడ్ రాజుకు కర్ణాటకకు చెందిన విప్రబాంధవ శ్రీనివాస కళ్యాణ సేవా సమితి, సప్తరుషి సౌహరద పత్తిన సహకార సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్ గురురాజరావు శాలువ జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.

నేడు ఉల్లి దిగుబడులు తీసుకురావొద్దు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ విపణికి 12,611 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయని కార్యదర్శి జయలక్ష్మి సోమవారం తెలిపారు. ఫలితంగా విపణిలోని ఉల్లి గోదాములు, షెడ్లు పూర్తిగా నిండిపోయాయని చెప్పారు. లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో అక్టోబరు 1వ తేదీన ఉల్లి దిగుబడులు తీసుకురావొద్దని రైతులను కోరారు.

సారూ.. మా సమస్యలు ఆలకించరూ

• నేడు జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా తమ సమస్యలు తీరుతాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తాగు, సాగునీరు, జీప్లస్ త్రీ ఇళ్లు, చేనేతల అవస్థలు, భూగర్భ మురుగు కాల్వల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సమస్యలపై దృష్టి సారించి, ఆగిపోయిన పనులకు నిధులు కేటాయించి, కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు



ముళ్ల పొదల మధ్య జీప్లస్‌త్రీ ఇళ్లు

మౌలిక వసతులు మరిచారు

పేదవాడికి ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఎమ్మిగనూరు పట్టణంలో 2014 నుంచి 2019 వరకు తెదేపా ప్రభుత్వం హయాంలో శివన్ననగర్ మైనారిటీ కాలనీలో 3264 గృహాలను నిర్మించారు. 2019లో ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పైసా నిధులు కూడా కేటాయించలేదు. డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలను ఏర్పాటు చేయలేదు. గృహాల చుట్టు ఉన్న ముళ్ల పొదలను కూడా తొలగించకపోవడంతో గృహాలలో ఉండటానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి మౌలిక వసతులను కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

టెక్స్‌టైల్ పార్కు రద్దు చేసి, చేనేతల పొట్టకొట్టి

2015 మే 2న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మిగనూరులోని బనవాసి వద్ద చేనేత టెక్స్‌టైల్ పార్కుకి శంకుస్థాపన చేశారు. రూ.44 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎనిమిది బడా కంపెనీలు ముందుకొచ్చాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, గూడూరు, ఆదోని, నాగలదిన్నె, నందవరం, నంద్యాల, నందికొట్కూరు ప్రాంతాలకు చెందిన సుమారు 25వేల మందికి ఉపాధి లభించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. అంతలోనే ప్రభుత్వం మారింది. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కును రద్దు చేసి ఇతర జిల్లాకు మళ్లించి చేనేతల పొట్ట కొట్టింది.

పదిశాతం పనులకు పదేళ్లు పడుతోంది

2009లో కాంగ్రెస్ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో భూగర్భ మురుగు నీటి కాల్వ పనులను చేపట్టారు. పట్టణంలో దాదాపు 136 కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం దాదాపు రూ. 44కోట్ల రుపాయలను మంజూరు చేశారు. ఇప్పటి వరకు రూ.39 కోట్లు ఖర్చు చేశారు. భూగర్భ పనులను పూర్తి చేస్తే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని, దీంతో ప్రజలకు వ్యాధుల వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. 2009నుంచి 2014వరకు దాదాపు 90శాతం పనులు పూర్తయ్యాయి. కానీ 2014నుంచి 2024 వరకు పది సంవత్సరాలలో మిగిలిన పదిశాతం పనులు పూర్తి చేయకపోవడంతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అసంపూర్తిగా నిలిచిపోయింది.

ఐదేళ్లలో పైసా నిధులు ఇవ్వక



సగంలో వదిలేసిన తాగునీటి పథకం ట్యాంకు నిర్మాణం

ఎమ్మిగనూరు పట్టణంలో శాశ్వత తాగునీటి పథకం కోసం రూ. 2019లో తెదేపా ప్రభుత్వం హయాంలో ఏపియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబి), రూ. 148. 01కోట్లు కేటాయించింది. ఈ పనులను 2019లో ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో గత ఐదేళ్ల కాలంలో పైసా నిధులు కూడా మంజూరు కాలేదు. దీంతో పట్టణంలో చేపట్టిన పనులు ఎక్కడికక్కడ మధ్యలోనే నిలిచిపోయాయి. గుత్తేదారుడు దాదాపు రూ. 5కోట్ల పనులు చేసిన ఆయనకు పైసా నిధులు కూడా ఇవ్వలేదు.

మాతృ భాష మాధ్యమాన్ని అమలు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆంగ్ల భాషా మాధ్యమం కొనసాగింపు జీవో 117ని రద్దు చేయాలని డీటీఎఫ్ నాయకులు మహబూబ్ బాషా, గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హెచ్.కైరవాడిలో అక్టోబరు 2న కర్నూలులో గాంధీ విగ్రహం వద్ద చేపట్టనున్న నిరసన కరపత్రాలను డీటీఎఫ్ అధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తామన్నా మార్పులను వెంటనే చేపట్టాలన్నారు. నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి.



పోటీలను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకులు

జీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు తైమూర్ బాషా ఆటల పోటీలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో గెలుపొందిన వారికి పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. యోగ, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్ పోటీలు రసవత్తరంగా జరిగాయి.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : సెపక్ తక్రా పోటీలలో అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నక్షత, సుహాస్‌ను గుడ్‌బేస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎబెల్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలో సత్తాచాటాలని అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు.

పొద్దు తిరుగుడు సాగు చేసుకోవాలి

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతులు పొద్దు తిరుగుడు సాగు చేసుకునేందుకు వారికి



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి

ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి, నంద్యాల పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాధాకుమారి తెలిపారు. సోమవారం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. షెడ్యూల్ ఉప ప్రణాళిక కింద రైతులకు టార్పాలిన్లు, కొడవలి, గడ్డపార, డ్రమ్ములు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటరమణమ్మ, రవిప్రకాష్, మౌనిక, నిరంజన్‌రెడ్డి, శ్రీచందన రైతులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : కరోనా సమయంలో ప్రజలకు సేవలందించి మృత్యువాత పడిన పారిశుద్ధ్య కార్మికులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు రాముడు కోరారు. సోమవారం కర్నూలులో జేసీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో కరోనా సమయంలో విధులలో నిర్వహిస్తూ 11 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. దీంతో తక్షణమే ఆ కుటుంబాలకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని కోరారు. ఇస్మాయిల్, నాగరాజు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్ డిమాండు చేశారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ పేదలకు సాగు భూమిలో సర్వ హక్కులు కల్పించాలన్నారు. పశ్చిమ ప్రాంతాలలో వలసలను అరికట్టేందుకు ఆర్డీఎస్ కుడి కాలువకు నిధులు విడుదల చేయాలన్నారు. కర్నూలు అధ్యక్షులు కృష్ణ, జిల్లా కార్యదర్శి నబిరసూల్, గిడ్డయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ నాయకులు రంగన్న, వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను కాపాడుకుందాం

ఎమ్మిగనూరు న్యూస్‌టుడే : రుద్ర శ్మశాన వాటిక భూమిని కబ్జాలు చేశారని వాటిని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరం పోరాటాల చేద్దామని హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ సమితి నాయకులు గణేష్ అన్నారు. సోమవారం యాదవ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు నారాయణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న హిందూ శ్మశాన వాటిక సరిహద్దులో కొందరు వ్యక్తులు కబ్జాలు చేశారని ఆరోపించారు. కబ్జా చేసిన స్థలాలపై అధికారులకు ఫిర్యాదు చేసినస్పందన లేదన్నారు. మాధవ స్వామి, బిఎల్ నారాయణ, బతకన్న, యాపిలయ్య, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన వెంటనే నిత్యావసర సరకుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బాల రాజు, బాబు, ఏఐకేఎంఎస్ పెద్ద గుంటప్ప పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులకు 25 శాతం రాయితీపై పప్పు శనగ విత్తనాలను అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ తెలిపారు. వర్కూరులోని రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఎంఏవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలానికి 2200 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించినట్లు తెలిపారు. క్వింటా ధర రూ. 9400 ఉండగా, రాయితీ పోనూ రూ. 7050కి అందజేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయని, కావాల్సిన వారు కనిష్ఠంగా 20 కిలోలు, గరిష్ఠంగా రెండు క్వింటాళ్ల వరకు తీసుకోవచ్చన్నారు.

11,337 క్యూసెక్కులు విడుదల

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సుంకేశుల జలాశయం నుంచి దిగువకు 11,337 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజనీరు రాజు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు సోమవారం నాటికి జలాశయానికి 11,337 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందన్నారు. ఇందులో నది దిగువకు 8,892 క్యూసెక్కులు, కేసీ కాలువకు 2,445 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని ఏఈ పేర్కొన్నారు.

భార్య ఫిర్యాదు..

మంత్రాలయం న్యూస్‌టుడే : అదనపు కట్నంకోసం వేధిస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ నాయక్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని వగరూరు గ్రామానిక చెందిన ఫాతిమ, తన భర్త సాధిక్‌పై మంత్రాలయం పోలీసులకు పిర్యాదు చేశారు.

దంచికొట్టిన వాన.. పొంగి పొర్లిన వాగులు



మునగాల – కొత్తకోట గ్రామాల రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీళ్లు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గూడూరు మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు మేరుపులతో 70.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు విరిగిపడగా కోతకు వచ్చి సజ్జ పంట నేలకు వాలింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి, కంది, ఉల్లి పంటలు నీట మునగాయి. మునగాల - కొత్తకోట, గూడూరు - నాగలాపురం గ్రామాల మధ్యలో వాగులు వర్షం నీటితో పొంగి పొర్లాయి. కొంతమంది రైతులు టార్పాలీన్లు కప్పి పంటలను రక్షించుకునేందుకు అవస్థలు పడ్డారు.

అపరిశుభ్రత మధ్య ఆసుపత్రి



పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు రోగులకు చెబుతుంటారు. పల్లెల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. కానీ పెద్దకడబూరు మండలంలోని చిన్న తుంబళం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం అపరిశుభ్రత మధ్య కొట్టుమిట్టాడుతోంది. పందులు స్వైరవాహారం చేస్తున్నాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. వైద్యం కోసం కేంద్రానికి వచ్చే రోగులు అపరిశుభ్రతను భరించలేక ముక్కు మూసుకొని వెళ్లే దుస్థితి నెలకొంది. కేంద్రం చుట్టూ ప్రహరీ లేక అపరిశుభ్రత నెలకొందని, ప్రహరీ మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే పెద్దకడబూరు,

గుంతలు కనిపించక.. గండాలు



ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నూలు రహదారిలో బైపాస్ రోడ్డు కూడలిలో రహదారిపై గుంతలు పడటంతో దారి నీటి కుంటను తలపిస్తోంది. ఈ అధ్వానమైన దారిలో వెళ్లాలంటే వాహనదారులు భయాందోళనకు గురౌతున్నారు. ఈ దారి నుంచి కర్నూలు హైద్రాబాదు, శ్రీశైలానికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే ఎమ్మిగనూరు

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సోమవారం కోడుమూరు పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఎంపీ నాగరాజును కోడుమూరు పట్టణంలోని కర్నూలు, బళ్లారి ప్రధాన రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని సీపీఎం నాయకులు గఫూర్‌మియా, వీరన్నలు కోరారు. పాతబస్టాండ్‌లో దుమ్ము, దూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణంలో ఎమ్మెల్యే ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. తమ నాయకుడు తెదేపా పట్టణాధ్యక్షుడు ఎల్లప్పనాయుడును రహదారి ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లి పరామర్శించారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు కొండపై వెలసిన శ్రీఉమామహేశ్వర స్వామి, మెయిన్‌బజార్‌లో వెలసిన శ్రీనీలకంఠేశ్వరస్వామికి వేదమంత్రోచ్చరణల మధ్య సోమవారం అభిషేకాలు చేశారు. శివ, పార్వతుల ఉత్సవమూర్తులను పాతబస్టాండ్, తేరుబజార్ మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పదవీ విరమణ పొందిన ఎంఈవో 2 శరభయ్యను సోమవారం ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంఈవో 1 వసంతలక్ష్మీ, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు శాలువలు, పూలమాలలు వేసి సన్మానించారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు పంచాయతీ సిబ్బంది బహుమతులను అందజేశారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య పనిలో జాప్యం చేయవద్దని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. కార్మికులకు కేటాయించిన కాలనీలో పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో మంగళవారం ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో విజయసింహారెడ్డి పేర్కొన్నారు. వంద శాతం పంపిణీ చేయుటకు కలెక్టరు ఆదేశాలతో గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించామన్నారు.

కోసిగి, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని సూపర్వైజర్ కాత్యాయిని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కాత్యాయిని ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

ఎమ్మిగనూరు నేరవార్తలు : పట్టణ సమీపంలోని ఎల్లెల్సీ కాలువలోకి ఈతకు వెళ్లి హుసేన్ (23) అనే యువకుడు సోమవారం మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. హుసేన్‌కి మూర్ఛ వ్యాధి ఉంది. దీంతో ఈత కొడుతున్న సమయంలో మూర్ఛవ్యాధి రావడంతో నీటిలోనే గల్లంతయ్యాడు. తోటి స్నేహితులు హుసేన్ కోసం గాలించిన ఆచూకి దొరకలేదు. సమాచారం అందుకున్న ప్రకృతి విపత్తుల అగ్నిమాపక సిబ్బంది కాలువలో గాలించి మృత దేహాన్ని వెలికితీశారు.

మద్యం మత్తులో కాలువలో పడి..

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో రాజు (25)అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు కోడుమూరు పరిధిలోని కల్లపరి గ్రామానికి చెందిన రాజు గూడూరు మండలంలోని చనుగొండ్ల గ్రామంలో ఉంటున్నారు. కొంతకాలంగా భార్య, భర్త మధ్యలో గొడవలు ఉండటంతో రాజు మద్యానికి బానిస అయ్యారు. సోమవారం మద్యం మత్తులో కాలువలో పడి మృతిచెందినట్లుగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెట్టును ఢీకొని..

వెల్దుర్తి, న్యూస్‌టుడే: చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఏఎస్ఐ సాదత్‌మియా తెలిపిన వివరాలు. ఎమ్మిగనూరుకు చెందిన కట్ల రమేష్(35) మండలంలోని మానేపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తూ అదే జిల్లాకు చెందిన ప్యాలపర్తి శ్రీనివాస్ వద్దకు పది రోజుల క్రితం పనికి చేరాడు. సోమవారం మానేపల్లి పక్క గ్రామం అందుగులపల్లికి పని నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి వస్తూ అందుగులపల్లి శివారులో ఓ చెట్టుకు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఘర్షణ.. కేసు నమోదు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే : చిన్నతుంబళంలో జరిగిన ఘర్షణలో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన కమ్మరి వీరేశ్, గంగాధర్, బుడ్డప్పపై అదే గ్రామానికి చెందిన బొడ్రం తాయన్న, బోయ నాయుడుతో పాటు వారి కుటుంబ సభ్యులు కర్రలతో దాడి చేసి గాయపర్చినట్లు తెలిపారు. కమ్మరి వీరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహితపై దాడి..

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే : తన భార్యపై ఓ వ్యక్తి దాడి చేశారని మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసులు ప్రకారం రామాంజనేయులుకు తన సోదరుడి కుమారుల మధ్య పొలం విషయంలో తగదా ఉంది. ఈ విషయంపై పులకుర్తి రాజారెడ్డి దగ్గర పంచాయతీ జరిగింది. పంచాయతీ విషయంలో రాజారెడ్డి తన భార్యపై దాడి చేశారని రామాంజనేయులు ఫిర్యాదు చేశారు.

నగర పంచాయతీలో పడకేసిన పారిశుద్ధ్యం

గూడూరు గ్రామీణం న్యూస్‌టుడే : నగర పంచాయతీలోని వీధులలో చెత్తను తూతూ మంత్రంగానే సేకరిస్తున్నారు. దీంతో చెత్తాచెదారం, వ్యర్థాలు రోడ్లపైనే రోజుల తరబడి పేరుకుపోతున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో వ్యర్థాలు కుళ్లి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దుర్వాసన వస్తుండటంతో పాటు, రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా వచ్చిన అధికారులు దృష్టి సారించి పారిశుద్ధ్యం సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మురుగు కాలువలో తొలగించని వ్యర్థాలు

డంప్ యార్డుల్లా..

గూడూరు నగర పంచాయతీలోని 20 వార్డుల్లో 5500 నివాసాలు ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 8 టన్నుల వ్యర్థాలు పోగవుతున్నాయి. వ్యర్థాలను డంప్ యార్డుకు తరలించడానికి 31 పబ్లిక్ హెల్త్ వర్కర్లు, ఒక కంప్యాక్టర్, ట్రాక్టరును వినియోగిస్తున్నారు. పారిశుద్ధ్యం కార్మికులు రోజుకు మూడు వార్డులను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. అందులోనూ శుభ్రం చేసిన చెత్తను అదే రోజు డంపింగ్ యార్డుకు తరలించకపోవడంతో వ్యర్థాలు రహదారి గుండా చెల్లాచెదురుగా పడిపోతుంది. వర్షాలు వచ్చినప్పుడు వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు దోమలు పెరిగిపోవడంతో రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పశ్చిమ, తూర్పు బీసీ కాలనీలతో పాటు శివారు కాలనీల్లో కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అక్కడక్కడ మురుగు రోడ్లపై పేరుకుపోవడంతో రాకపోకలకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేవారు లేరు - చంద్రమోహన్, గూడూరు

స్వచ్ఛతా హి సేవా అంటూ ప్లకార్డులు పట్టుకొని కాలనీల్లో తిరుగుతూ ఫొటోలు తీసుకొని వెళ్తున్నారు. కానీ పారిశుద్ధ్యంపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. రోజుల తరబడి చెత్త రహదారులపై ఉంటుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం - నాగరాజు కమిషనర్

నగర పంచాయతీలో తొలగించిన వ్యర్థాలను డంప్ యార్డులకు తరలించడానికి వాహనాల కొరత ఉంది. దీంతో సరైన సమయానికి రహదారులపై ఉన్న చెత్తను తొలగించలేకపోతున్నాం. త్వరలోనే పారిశుద్ధ్యం సమస్య తీవ్రంగా ఉన్న కాలనీల్లో స్పెషల్ డ్రైవ్ చేపడతాము.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో సోమవారం పర్యటించారు. ముఖ్యమంత్రి మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. ఇక్కడి నుంచి బయలుదేరి పత్తికొండకు 1.05 గంటలకు చేరుకుంటారన్నారు. పుచ్చకాయలమడలో పింఛన్ల పంపిణీ, గ్రామసభలో పాల్గొంటారని పేర్కొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ కల్యాణి, విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉల్లి దిగుబడులు తీసుకురావొద్దు

కర్నూలు సచివాలయం : కర్నూలు వ్యవసాయ విపణికి 12,611 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయని కార్యదర్శి జయలక్ష్మి సోమవారం తెలిపారు. విపణిలోని ఉల్లి గోదాములు, షెడ్లు పూర్తిగా నిండిపోయాయని చెప్పారు. లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో అక్టోబరు 1వ తేదీన ఉల్లి దిగుబడులు తీసుకురావొద్దని రైతులను కోరారు.

మేమున్నాం... మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు (గ్రామీణ) : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, **సమస్య:** ఎన్‌ఆర్‌పేట వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. – స్థానికులు

సమస్య: నిర్మల్ నగర్‌లో ఉద్యానవనం అభివృద్ధి చేయాలి. కాలువలు శుభ్రం చేయాలి. – స్థానికులు

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. - నగరపాలక అధికారులు

స్వచ్ఛందంగా రుధిరమిచ్చి.. బాధితులకు అభయమిచ్చి

పలువురి స్ఫూర్తి

– న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంప్, వైద్యాలయం

పలువురు యువకులు రక్తదానం చేస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి.. ప్రసవం సమయంలో గర్భిణులు.. అస్పత్రుల్లో చికిత్స పొందే బాధితులకు రక్తదానం చేసి ప్రాణాలు నిలుపుతున్నారు. ప్రస్తుత సమాజంలో ఇప్పటికీ రక్తదానంపై అపోహలున్నాయి. అవగాహన లేకపోవడం.. అపోహలతో అయినవారే రక్తమిచ్చేందుకు వెనుకాడుతున్నారు. కానీ ఎందరో స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సాటివారి ప్రాణాలు కాపాడుతున్నారు. నేడు స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

39సార్లు రక్తదానం



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు రామాంజనేయులు. వీరిది పత్తికొండ మండలం పుచ్చకాయలమడ. మొదటగా యువభారత్ సేవాసమితి వ్యవస్థాపకుడు రాగిమాన్ రమేష్ రక్తదానం చేయించారు. ఆ తర్వాత 2015లో దావీద్ అనే వ్యక్తికి రక్తదానం చేయడంతో అతను కోలుకున్నారు. అప్పటినుంచి ఏటా పలుమార్లు రక్తదానం చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 39సార్లు రక్తదానం చేసినట్లు రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ సేవాసమితి కార్యదర్శిగా పనిచేస్తున్నానని.. ఎవరికైనా రక్తం అవసరమైతే సేవాసమితి ద్వారా ఇస్తుంటామని.. ప్రాణాలు కాపాడాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

మిత్రుడి కష్టం చూసి..



ఈ చిత్రంలోని యువకుడి పేరు కొండల్. ఇతనిది కర్నూలు గణేశ్ నగర్‌లోని నాలుగో తరగతి కాలనీ. అతని చిన్ననాటి మిత్రుడు కిరణ్ తల్లికి 2015లో రక్తం కావాల్సి వచ్చింది. రక్తం కోసం వాళ్లు పడిన ఇబ్బందులు కళ్లారా చూశారు. దీనిని చూసి అతని మనస్సు చలించిపోయింది. ఈ నేపథ్యంలో ఆరోజే నిర్ణయం తీసుకున్నారు. రక్తం కావాలని ఎవరు ఫోన్ చేసినా ఇస్తున్నారు. 2016 నుంచి ఏడాదికి రెండుసార్లు చొప్పున ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా రక్తం కావాల్సి వస్తే 90634 58337 నంబరుకు ఫోన్ చేయొచ్చని పేర్కొంటున్నారు.

విద్యార్థి దశ నుంచే..



కల్లూరుకు చెందిన సుదర్శన్‌గౌడ్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 2008లో రక్తదానం చేయడం ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్‌లో ఉండటంతో ఎంతో సేవాభావం ఉండేది. అలా డిగ్రీ చదివే రోజుల నుంచి రక్తదానం చేస్తున్నారు. ఏబీ నెగటివ్ కావడం.. యువభారత్ సమితికి చెందిన రామాంజనేయులు పరిచయమవడంతో పలుమార్లు రక్తదానం చేశారు. 2021లో ఓ గర్భిణి ప్రాణాపాయ స్థితిలో ఉండగా వెంటనే రక్తం ఇవ్వడంతో ఆమె కోలుకున్నారు. ఇప్పటికి 16 సార్లు రుధిరం ఇచ్చారు. ప్రస్తుతం కమాండ్ కంట్రోల్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నానని.. రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలు నిలుస్తున్నాయనే భావన ఎంతో సంతోషాన్నిస్తోందని సుదర్శన్‌గౌడ్ పేర్కొంటున్నారు.

ఇబ్బందులు గుర్తించి..



కర్నూలు ఖండేరి వీధికి చెందిన సాయికుమార్ ఎందరో బాధితులకు చేయూతనిస్తున్నారు. ముఖ్యంగా తలసేమియా బాధితులు, గర్భిణులకు రక్తం అందక చాలా ఇబ్బందులు పడుతుంటారు. బాధితుల కష్టాలు కళ్లారా చూసిన ఆతను రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నారు. 2017 నుంచి 2023 వరకు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేశారు. ప్రస్తుతం తలసేమియా బాధితులు, గర్భిణులకు రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సాయికుమార్ చెప్పారు. అవసరమైనవారు 96664 14475 నంబరును సంప్రదించాలని కోరారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టండి



జేసీతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ సంక్షేమ, విద్య సహాయకుల బదిలీల్లో అక్రమాలు జరిగాయని.. వీటిని రద్దు చేసి పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జేసీ డా.బి.నవ్యను కలిసి సమస్యను విన్నవించారు. ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లులో సవరణలు అవసరం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, పక్కన సోమిశెట్టి తదితరులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వక్ఫ్ బిల్లుపై అనేక అభ్యంతరాలున్నాయని మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముసాయిదా ప్రాతిపదికన వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని ముస్లింల సంక్షేమాభివృద్ధికి పాటుపడేలా సవరణలు చేయాలని కోరారు. నగరంలోని తెదేపా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, షేక్ ముంతాజ్ తదితరులతో కలిసి సోమవారం మాట్లాడారు. ముస్లింల మనోభావాలు, వారి అభిప్రాయాలు తెలుసుకొని జాయింట్ పార్లమెంటరీ కమిటీ ద్వారా కేంద్రానికి సమగ్ర నివేదికలు అందించాలని సీఎం సూచించారన్నారు. వక్ఫ్ బిల్లులో సవరణలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

4న ఉద్యోగ మేళా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలని జేసీ డా.బి.నవ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉద్యోగ మేళా గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈనెల 4న ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిరంజీవి, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి దీప్తి, నైపుణ్య అభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముల్లు కదలదు.. సమయం తెలియదు





కర్నూలు విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద క్లాక్‌టవర్ ఏర్పాటు చేశారు. అందరికీ కనపడేలా పెద్ద గడియారం పెట్టారు. దీనికి రూ.లక్షల నిధులు వెచ్చించారు. గత నెల రోజులుగా గడియారం ముల్లులు తిరగడం లేదు. సమయాలు గందరగోళంగా ఉండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంపు

బాపూ బాటలో నడిచారు..



గాంధీ జయంతి నేపథ్యంలో నందికొట్కూరు సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థినులు కలెక్టరేట్, జిల్లా పరిషత్ వద్ద నున్న గాంధీ విగ్రహాలను ఎన్‌సీసీ అధికారిణి శ్యామల నేతృత్వంలో సోమవారం శుభ్రం చేశారు. గాంధీ బాటలో నడుస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తామని వారు పేర్కొన్నారు. అందరూ గాంధీజీ బాటలో నడవాలని పిలుపునిచ్చారు. – న్యూస్‌టుడే, కర్నూలు క్యాంపు

వినతులకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరవాసులు ఇచ్చే వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగ అధికారులను నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రహదారులు, కాలువలు నిర్మించాలని, మంచినీటి వసతి, టిడ్కో గృహాలు తదితర వాటిపై పలువురు వినతిపత్రాలు అందించారు..

☛ నగరంలోని అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, లేబర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు.

కాలనీ కబుర్లు

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి సోమవారం కలెక్టరేట్ వద్దనున్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, గదుల నిర్వహణ, సౌకర్యాలను పరిశీలించారు. రిజిస్ట్రార్, దస్త్రాలు పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రతి గ్రామ సచివాలయంలో షెడ్యూలు కులాల ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసి జనాభా (కుల) గణాంకాలు చేపడితే ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మార్పీఎస్ నేత ఆంజనేయ మాదిగ అన్నారు. కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో మాట్లాడారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. ఆయన సోమవారం ముజఫర్‌నగర్‌లో మాట్లాడారు. ఈ సమావేశంలో పి.నిర్మల, అలివేలమ్మ, రాముడు, సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మంత్రి టీజీ భరత్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నె సుబ్బారెడ్డిని తెదేపా కల్లూరు మండల అధ్యక్షుడు, అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఇంటి స్థలాల కుంభకోణాలపై ఎలాంటి చర్యలు లేవని సీపీఐ నేత రామకృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు చెంచు నాగన్న, శ్రీనివాసులు అన్నారు. స్థలాల కుంభకోణాలపై న్యాయ విచారణ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలు అందిస్తోందని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. ఆయన సోమవారం ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పలు పథకాలపై సమీక్ష నిర్వహించారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ పౌరసరఫరాల డైరెక్టర్ మహేష్ సోమవారం కర్నూలులో మంత్రి టి.జి.భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆయనతోపాటు పాణ్యం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆయన సోమవారం కర్నూలులోని స్పోర్ట్స్ అథారిటీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. శాయ్ సెంటరులో ఉన్న సమస్యలపై ఆ కేంద్రం ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు శాయ్ కేంద్రం ఎక్కడికీ తరలిపోదని చెప్పారు. క్రీడాకారులకు తమవంతు చేయూతనిస్తామని పేర్కొన్నారు.



శాయ్ కేంద్రం ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని జేసీ డా.బి.నవ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ఏ ఒక్క అర్జీ గడువు దాటి పెండింగ్‌లో ఉండకూడదని అధికారులకు సూచించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల వివరాలను డీఆర్వోకు అందజేయాలని సూచించారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ కల్తీ అంశంలో జగన్‌కు మద్దతుగా మాట్లాడుతున్న కొడాలి నాని, పేర్ని నానిలు నోరు అదుపులో పెట్టుకోవాలని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన సోమవారం కర్నూలులో మాట్లాడారు. తితిదే నిబంధనల మేరకు డిక్లరేషన్‌పై సంతకం చేసేందుకు ఇష్టపడక జగన్ తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నారని, తన పర్యటన రద్దుకు కారణాలను చంద్రబాబుపై వేసేందుకు కులాల ప్రస్తావన తీసుకొచ్చారని మండిపడ్డారు.

పటాలం దళాధిపతికి వీడ్కోలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఏపీఎస్పీ రెండో పటాలం దళాధిపతి పి.రవిశంకర్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక పటాలం మైదానంలో ఆయనకు అధికారులు, పోలీసులు గౌరవ వందనం కార్యక్రమం నిర్వహించారు. వృత్తి జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా రవిశంకర్, వినూత రెడ్డి దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సాయంత్రం సంప్రదాయ పద్ధతిలో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతులు సుధాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రవిశంకర్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

అదనపు బాధ్యతల అప్పగింత

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)కి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాత్కాలికంగా సెక్రటరీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న పి.హనుమంత రెడ్డిని ఆ విధుల నుంచి తప్పించారు.

వాలంటీరు వ్యవస్థ కొనసాగించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వాలంటీరు వ్యవస్థను కొనసాగించాలని.. బకాయి వేతనాలు చెల్లించాలని ఏపీ వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్ కోరారు. కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగు నెలలవుతున్నా ఇప్పటివరకు వాలంటీర్ల గురించి మాట్లాడకపోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుకన్య, నూర్‌బాషా, చంటి, చంద్రయాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు అవసరం

కర్నూలు బి.క్యాంపు, కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ కోసం జాతీయస్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ జిల్లా సమన్వయకర్త చింతా సురేశ్‌బాబు, సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయంలో దీపారాధన నిర్వహించారు. జాతీయస్థాయి సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు.

స్వశక్తితో రాణించి.. విజయాలు సాధించి

• వాలీబాల్‌లో సుకన్య ప్రతిభ



కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : కర్నూలు నగర పరిధిలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో సుకన్య బీబీఏ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు సులోచన, మల్లికార్జున. వారి స్వగ్రామం వెల్దుర్తి. హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సుకన్యకు మొదటి నుంచి క్రీడలంటే ఎనలేని ఆసక్తి. ఒకపక్క చదువుకుంటూనే తనకు ఇష్టమైన వాలీబాల్లో సాధన చేయడం ప్రారంభించారు. మరోవైపు ఉపాధ్యాయులు, స్నేహితులు ప్రోత్సహించడంతో వెనుదిరిగి చూడలేదు. అవసరమైన మెలకువలు నేర్చుకుని పోటీల్లో దిగారు. ఎక్కడ జరిగినా పాల్గొంటూ జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించారు.

జట్టులో కీలకపాత్ర

2017లో కడపలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో సుకన్య మొదటి స్థానంలో నిలిచారు. 2018లో లేపాక్షిలో జరిగిన జోనల్ వాలీబాల్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి ప్రతిభ చూపారు. 2022-2023 క్రీడా వార్షిక పోటీల్లో భాగంగా నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల వాలీబాల్ పోటీల్లో కళాశాల నుంచి స్ట్రైకర్‌గా పాల్గొని రన్నర్స్ ట్రోఫీ అందుకోవడం విశేషం. గతేడాది అక్టోబరులో కర్నూలు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి టైటిల్ సాధించారు. త్వరలో జరిగే ఆర్‌యూ అనుబంధ కళాశాలల వాలీబాల్ పోటీల్లో దూకుడుగా ఆడి జట్టుకు విజయం అందించడమే తన లక్ష్యమని సుకన్య చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ కర్నూలు స్టేషన్ సీఐగా చంద్రహాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుత్తు శాఖ ఏడీఈ బదిలీ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాల కారణంగా సస్పెన్షన్‌లో ఉన్న ఏడీఈ డి.వి.నాగేంద్రప్రసాద్‌ను ఆలూరు నుంచి ఎమ్మిగనూరు ఏడీఈగా బదిలీ చేస్తూ కార్పొరేట్ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా ఎస్ఈ ఎం.ఉమాపతి నియంత్రణలో ఎమ్మిగనూరు ఏడీఈగా విధులు నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాధనతో ఏకాగ్రత సాధ్యం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: విలువిద్య క్రీడా సాధనతో చిన్నారుల్లో ఏకాగ్రత పెరుగుతుందని డా.శంకర్‌శర్మ అన్నారు. స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి విలువిద్య పోటీలను ఆ సంఘం కార్యదర్శి రత్నమ్మయ్య, వంశీ, రాజులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీలను న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి హర్షవర్ధన్ సోమవారం ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నరసప్ప, రాందేవ్, భాస్కర్‌రెడ్డి, ఓబన్న, లక్ష్మయ్య, మల్లేష్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: నగర శివారులోని రిడ్జి ఉన్నత పాఠశాల మైదానంలో సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర ఫుట్‌బాల్ పోటీలను పాఠశాల సీఈవో గోపినాథ్ సోమవారం ప్రారంభించారు. అండర్-17 బాలుర విభాగంలో రిడ్జి ఉన్నత పాఠశాల జట్టు హైదరాబాద్ సిల్వర్ ఓక్స్‌ఓకేడేల్ పాఠశాలపై విజయం సాధించి శుభారంభం చేసింది. నెల్లూరు జట్టు, హైదరాబాద్ నారాయణ గురుకుల్ జట్టు, కర్నూలు ఇండస్ జట్టు ప్రత్యర్థులపై పోరాడి విజయం సాధించాయి. పలు పోటీల్లో వివిధ జట్లు గెలుపొందాయి.



విజయం కోసం పోటీ పడుతున్న క్రీడాకారులు

లడ్డూ ఘటనపై సీఐడీతో విచారణ జరపాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజనాథ్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని కూటమి ప్రభుత్వం చెబుతోందని, దీనిపై సీఐడీతో విచారణ జరిపించాలని మాజీ మంత్రి సాకే శైలజనాథ్ పేర్కొన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని గొప్పగా చెప్పిందని.. ప్రస్తుతం కేవలం పింఛన్లు మాత్రం ఇచ్చిందని పేర్కొన్నారు. వైకాపా అరాచక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని.. మరి వారికి ఏమి చేశారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు గాంధీ జయంతి రోజు నిరసన చేపట్టడంతోపాటు గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ, మాజీ మంత్రి మారెప్ప, డీసీసీ మాజీ అధ్యక్షుడు బాబురావు, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పాతబస్తీ దండగేరికి చెందిన కె.అశోక్ కుమార్‌ను మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. మునగాలపాడు వంతెన వద్ద ఆటోను తనిఖీ చేయగా 50 తెలంగాణ మద్యం సీసాలు బయటపడ్డాయి. అతడిని అదుపులోకి తీసుకుని వాహనంతో సహా మద్యం సీజ్ చేశారు. కర్నూలు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.